
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 16 ఆగస్టు 2025



స్వచ్ఛరథం కార్యక్రమానికి రూపకల్పన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'స్వచ్ఛరథం' కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలో ఇంటింటా తిరుగుతూ గృహాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే స్వచ్ఛరథానికి మంత్రి కందుల దుర్గేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గృహిణులకు స్నానం సబ్బులు, బట్టలు ఉతికే సబ్బులు, నూనె ప్యాకెట్లు, పసుపు, బెల్లం, చింతపండు, ఉల్లిపాయలు వంటి నిత్యావసర వస్తువులు అందజేస్తారన్నారు. పల్లెల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి, గ్రామాలను శుభ్రంగా ఉంచడానికి ఈ కార్యక్రమం ఒక మోడల్‌గా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ముువ్వన్నెల జెండా రెపరెపలు

79 స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వెన్నల జెండా రెపరెపలాడింది. తూర్పు గోదావరి జిల్లా కేంద్రంలో పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్రోద్యమ నేతలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో పలువురు ఎంఎల్ఎలు, ఎంపిపిలు, సర్పంచులు, పిఎసిఎస్ ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసి ఛైర్మన్లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం

రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో 79వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మువ్వెన్నల జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధులు, అమరవీరులకు నివాళులర్పించారు. అపార అనుభవం, పరిపాలనాదక్షత కలిగిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అందరి భాగస్వాములు కావాలని కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న దళాల కవాతు

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో వివిధ దళాల నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కవాతుకు పరేడ్ కమాండర్‌గా టివిఆర్‌కె.కుమార్ నాయకత్వం వహించారు. ఈ దళాలు స్వాతంత్య్ర సమరయోధుల త్యాగస్ఫూర్తిని స్మరింపజేశాయి.

ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో...

ఎస్‌పి క్యాంప్ కార్యాలయం వద్ద ఎస్‌పి ఎస్‌పి డి.నరసింహకిషోర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. దేశ స్వాతంత్య్రం కోసం అశువులు బాసిన త్యాగమూర్తుల ఆశయాల కోసం ప్రతీ ఒక్కరూ పునరంకితం అవుదామని ఎస్‌పి పిలుపునిచ్చారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో...

రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ పి.ప్రశాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్ఎలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని మాట్లాడారు. కార్యాలయ ఆవరణలోని గాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, డిప్యూటీ డైరెక్టర్ రామారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఇ ఎంసిహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ అబ్దుల్ మాలిక్, ఆర్ఓలు సిహెచ్.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంహెచ్ఒ ఎ.వినూత్న, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, సచివాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది.

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో..

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎడిషన్ కార్యాలయం వద్ద స్వాతంత్య్రదినోత్సవాన్ని నిర్వహించారు. పూర్వ మేనేజర్ టిఎస్.ప్రకాష్ పతాకావిష్కరణ చేశారు. స్వాంత్రత్యోద్యమ ఘట్టాలు, ప్రస్తుతం దేశంలో రాజ్యమేలుతున్న మతతత్వం, ఆర్‌ఎస్ఎస్ విధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు. **గోకవరం** మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలతోపాటు, ఆర్టీసీ డిపో, రెవెన్యూ, పోలీస్‌స్టేషన్, అటవీ శాఖ, మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. **ఉండ్రాజవరం** మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల వద్ద, పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలల వద్ద ఆయా అధికారులు, యాజమాన్య ప్రతినిధులు జెండాను ఎగురవేశారు. **తాళ్లపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి జొన్నకూటి పోసిరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ లక్ష్మీ లావణ్య, గాంధీ బొమ్మ వద్ద మానవతా గౌరవ ఛైర్మన్ సింహాద్రి జనార్దనరావు, పిహెచ్‌సి వద్ద డాక్టర్ హారికా గుప్తా, న్యూ చైతన్య ఆటో యూనియన్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వద్ద వ్యవస్థాపక కరస్పాండెంట్ వివి.అనీష్ జాతీయ జెండాను ఎగురవేశారు. పంచాయతీల వద్ద సర్పంచ్‌లు, పలు ప్రభుత్వ, ప్రైయివేటు కార్యాలయాల వద్ద ఆయా సంస్థల ప్రతినిధులు జాతీయ పతాకాలను ఎగురవేశారు. **నల్లజర్ల** స్థానిక జడ్‌పి హైస్కూల్ వద్ద ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎస్‌విఎస్.నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే మండల పరిషత్, రెవెన్యూ, పిహెచ్‌సి, పోలీస్‌స్టేషన్, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు, బ్యాంకులు, వివిధ యూనియన్ల కార్యాలయాల వద్ద ఆయా ప్రతినిధులు జెండాలను ఆవిష్కరించారు. **పెరవలి** మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వమించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి కె.సీతారాంప్రసాద్, రెవెన్యూ కార్యాలయం వద్ద కె.నిరంజన్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, పాఠశాలల వద్ద ఎస్ఎంసి ఛైర్మన్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పలుచోట్ల పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మొక్కలను నాటారు. **నిడదవోలు** పురపాలక సంఘం కార్యాలయం వద్ద మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ జువ్వల రాంబాబు అధ్యక్షతన పట్టణంలో 175 అడుగుల జాతీయ పతాకంతో ప్రదర్శన చేశారు. అలాగే రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ పతకాలను ఎగురవేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 150 అడుగుల పతాకంతో ర్యాలీ నిర్వహించారు. నిస్సీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పిహెచ్‌సి వద్ద బ్రెడ్, బిస్కట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. **బిక్కవోలు** మండలంలోని బలభద్రపురం గ్రామంలో మాజీ సర్పంచ్ కొవ్వూరి సుజాత స్వగృహం వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాకల కార్యాలయాల వద్ద, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకుల వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. **కడియం** మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ మారిశెట్టి పద్మావతి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమెను సత్కరించారు. పలుగ్రామాల్లో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పలు స్కూళ్లల్లో వినూత్నంగా వేడుకలు నిర్వహించారు. **గోపాలపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాజమనోహర్, అలాగే తహశీల్దార్ కార్యాలయం వద్ద కె.అజేయ్‌బాబు, పంచాయతీలు, ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, బ్యాంకుల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఇదిలావుంటే మండలంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు తమను ఆహ్వానించకపోవడం దారుణమని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ప్రజాప్రతినిధులుగా ఉన్న తమతోపాటు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. **చాగల్లు** స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.మేరికమ్మ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి మట్ట వీరస్వామి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలతోపాటు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు, పంచాయతీలు, సొసైటీల వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లైన్స్ క్లబ్ కార్యాలయం వద్ద లైన్స్ క్లబ్ అధ్యక్షులు వివి.రామారావు జాతీయ జెండా ఆవిష్కరించారు. **సీతానగరం** మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ భారతి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ శ్రీనివాస్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ రామ్‌కుమార్, కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల జాతీయ జండాలను ఆవిష్కరించారు. అలాగే పంచాయతీలు, సొసైటీలు, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే సాధన సేవా సంస్థ ఆధ్వర్యంలో పురుషోత్తపట్నంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో సినీ డైరెక్టర్ యనమదల కాశీ విశ్వనాథ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాధన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు పసలపూడి సుజ్ఞానకుమారి పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కెవికె.దుర్గారావు జెండాను ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో కలెక్టర్ పిప్రసాంతి, ఎస్‌పి నరసింహాకిషోర్



ఆకట్టుకున్న పర్యాటక సాంస్కృతిక శాఖ శకటం



ప్రజాశక్తి ఎడిషన్ కేంద్రంలో జెండాను ఆవిష్కరిస్తున్న టిఎస్.ప్రకాష్



దేవరపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి దుర్గారావు



సీతానగరంలో జరిగిన సినీ దర్శకుడు కాశీవిశ్వనాథ్



గోపాలపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి ఉండవల్లి



కడియంలో సర్పంచ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి



గోకవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి సుంకర శ్రీవల్లి

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దేశ సంపద ప్రభుత్వ ఆధీనంలో ఉంచడంతోపాటు, మత సామరస్యంను కాపాడుకునేందుకు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. నగరంలోని శ్యామల సెంటర్‌లోని సిపిఎం కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశాన్ని 200 ఏళ్లపాటు స్వేచ్ఛ లేకుండా బ్రిటిష్ సామ్రాజ్యవాదం అడుగడుగునా దోచుకున్నదని గుర్తు చేశారు. దేశ ప్రజలకు స్వేచ్ఛ, స్వావలంబన, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం, తినడానికి తిండి, బట్ట, ఇల్లు, స్వాతంత్య్రం ఇవేమీ లేకుండా బ్రిటిష్ సామ్రాజ్య వాదం హరించిందన్నారు. వీటి కోసం దేశ ప్రజలు ఉద్యమించి లాఠీల, తూటాలకు భలయ్యారని, అనేక మంది ప్రాణత్యాగాలతో దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ప్రతీ ఏటా 35 వేల అత్యాచారాల కేసులు నమోదు అవుతున్నాయని పాలకులే చెబుతున్నారని అన్నారు. బ్రిటిష్ హయాంలో సాగిన హింస కాండ నేటి ప్రభుత్వ పాలనలో కొనసాగుతుందన్నారు. నాడు బ్రిటిష్ వాళ్ళు సంపద మొత్తాన్ని దోచుకుంటే, ప్రస్తుత పాలకులు అదానీ, అంబానీ, ఇతర కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత దేశ ప్రజలు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందన్నారు. నాడు బ్రిటీష్ వాళ్లు ప్రజల మధ్య చిచ్చుపెట్టారో ప్రస్తుత పాలకులు మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విభజించి మత కల్లోలాలు సృష్టిస్తున్నారని అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం అనే పునాదిపై ఉందని గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు టి.తులసి, ఎస్ఎస్.మూర్తి, బి.పూర్ణిమరాజు, నాయకులు వెంకటేశ్వరరావు, తాతారావు, రాంబాబు, భాస్కర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సిపిఎం నాయకులు



ఉండ్రాజవరంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపిపి



నల్లజర్లలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు



పెరవలిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి సీతారాంప్రసాద్



నిడదవోలులో భారీ జాతీయ పతాకంతో జరుగుతున్న ర్యాలీ



బిక్కవోలులో మాజీ ఎంఎల్ఎ సూర్యనారాయణరెడ్డి, ఇతరులు

పలు సొసైటీల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం




ప్రమాణస్వీకారం చేస్తున్న కె.అగ్రహారం పిఎసిఎస్ త్రీమేన్ కమిటీ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కొత్తపల్లి అగ్రహారం పిఎసిఎస్ అధ్యక్షునిగా సలాది సత్యనారాయణ, డైరెక్టర్లుగా కేతా నాగేశ్వరరావు, మాణిక్‌రెడ్డి నాగరామకృష్ణ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ మంత్రి దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆశీస్సులతో ఈ పదవి వచ్చిందన్నారు. సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండారు బాబి, నల్లాకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఐ టిడిపి అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు సలాది కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ సలాది శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్నవరప్పాడు పిఎసిఎస్ అధ్యక్షులుగా పొప్పొప్పు వెంకట నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా కోటిపల్లి నరసింహమూర్తి, గుడాల సత్తిరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి దుర్గేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆశీస్సులతో ఈ పదవి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వారికి నాయకులు పొప్పొప్పు సూర్యనాగేశ్వరావు, పిప్పర రవికుమార్, అతికాల శ్రీను, రంగనీడి కట్లయ్య, గడిగొప్పు గంగాధర్ అభినందనలు తెలిపారు



ప్రమాణస్వీకారం చేస్తున్న అన్నవరప్పాడు పిఎసిఎస్ త్రీ మెన్ కమిటీ



మహిళలకు ఉచిత ప్రయాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - నిడదవోలు, గోకవరం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ స్కిల్ డవలంప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను కేటాయించినట్లు తెలిపారు. సిఎం, డిప్యూటీ సిఎంల నేతృత్వంలో సాహసోపేత నిర్ణయాలు, దిగ్విజయంగా సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తున్నామని తెలిపారు. నిడదవోలు డిపోకు మంచి బస్సు సర్వీసులు అందించాలని లేని యెడల కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌టిసి అధికారులను హెచ్చరించారు. స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.2.62 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని, తద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.1942 కోట్ల భారం పడుతుందన్నారు. అయినా మహిళలకు ఇచ్చిన మాటను నెరవేర్చడం కోసం కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను భరిస్తోందన్నారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో నిడదవోలు డిపోకు గత వైభవాన్ని తెస్తామన్నారు. ఆటో యూనియన్లు, కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఉపాధికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గోకవరం డిపోలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మహిళల ఉచిత బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఐదు రకాల బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం సాగించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ కార్డ్ ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపిస్తే మహిళలకు ఉచిత ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో అధికారులు, సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నిడదవోలులో ఉచిత బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



గోకవరంలో బస్సును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

విఆర్‌ఒల సంఘం అధ్యక్షునిగా బాబూరావు

ప్రజాశక్తి - సీతానగరం

విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షునిగా పోసుపో బాబూరావు ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానికంగా విఆర్‌ఒల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్షునిగా వంగలపూడి విఆర్‌ఒ పోసుపో బాబురావు, గౌరవ అధ్యక్షుడిగా చినకొండేపూడి విఆర్‌ఒ పసలపూడి రమేష్, ఉపాధ్యక్షురాలుగా మునికూడలి విఆర్‌ఒ నామాలఒ రత్నకుమారి, కార్యదర్శిగా మిర్తిపాడు విఆర్‌ఒ బెల్లపు నాగేశ్వరరావు, కోశాధికారిగా ఉండేశ్వరపురం విఆర్‌ఒ తాళ్లూరి విజయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



విఆర్‌ఒల సంఘం నూతన కార్యవర్గం

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సుతో ఉపాధి కోల్పోతున్న తమకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని ఆటో ఓటర్లు, డ్రైవర్లు కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం బస్సును ప్రారంభించేందుకు వచ్చిన పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్, స్కిల్ డవలంప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావులకు ఆటో ఓనర్లు, డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దవారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే దీనివల్ల తమ ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోతున్న తమకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ తారకరామా కాలనీ శివారులో పేకాట శిబిరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు ప్రకారం.. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా జొన్నాడ తారకరామా కాలనీ శివారులో ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2700 స్వాధీనం చేసుకుని నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే వారిపైనా ఎపి గేమింగ్ యాక్ట్ పై కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అత్యాచారం కేసులో హోం గార్డు అరెస్ట్

ప్రజాశక్తి -ముమ్మిడివరం

అత్యాచారం కేసులో హోం గార్డును శుక్రవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న బీర నాగరాజు హైవే మొబైల్‌లో వాహనంపై విధులు నిర్వహిస్తున్నాడు. అయితే నాగరాజు ముమ్మిడివరానికి చెందిన ఒక యువతతో పరిచయం పెంచుకొని ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. బాధితురాలు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి నాగరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ జ్వాలా సాగర్ తెలిపారు.



బెలూన్లు ఎగరవేస్తున్న మంత్రి లక్ష్మీనారాయణన్, ఎంఎల్ఎ

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో పుదుచ్చేరి ప్రజా పనులశాఖ మంత్రి లక్ష్మీనారాయణన్ ముఖ్య అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్‌పి చింతా కోదండరామ్ శాంతి కపోతాలను, త్రివర్ణ బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. పోలీసులు, హోమ్ గార్డులు, ఆయా పాఠశాలలకు చెందిన స్కౌట్ దళాలు భారీ కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐ నూకరాజుకు పోలీస్ సర్వీస్ మెడల్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చే రాజీవ్ గాంధీ పోలీస్ ప్రతిభా సేవా పతకానికి యానాం పోలీస్ శాఖ ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు ఎంపికయ్యారు. శుక్రవారం పుదుచ్చేరిలో జరిగిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సిఎం రంగసామి చేతుల మీదుగా పోలీస్ సర్వీస్ మెడల్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా నూకరాజు ను పలువురు అభినందించారు.



గంగార్జునను సత్కరిస్తున్న సర్పంచ్ భవాని

కష్టపడితే లక్ష్యాలను సాధించొచ్చు

ప్రజాశకి-ప్రత్తిపాడు

క్రమశిక్షణతో కష్టపడితే జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని అన్నారు. గామానికి చెందిన సుంకర గంగార్జున ఇటీవల కానిస్టేబుల్‌కు ఎంపిక కావడంతో గంగార్జునను సర్పంచ్ తుమ్మల భవాని, వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పన వెంకన్నబాబు, కొప్పన గంగారావు, రామకుర్తి రాజా, కొప్పన రాంబాబు, చింతపల్లి ఏసు, తిరగటి రాజా పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో సుమారు 2000 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పూజలకు సంబంధించి పూజా సామాగ్రి దేవస్థానం వారు ఉచితంగా అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఇఒ వడ్డి శ్రీనివాసరావు, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెట్టింటి నారాయణాచార్యులు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలకు 6వేల మంది మహిళలు


ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు 6000 మంది మహిళలు హాజరైనట్లు కార్యనిర్వాహణాధికారి అల్లు వెంకట దుర్గ భవాని తెలిపారు. మహిళలకు ఉచితంగా చీర, జాకెట్, వరలక్ష్మీ రూపు, ఇతర పూజ సామగ్రి దాతల సహకారంతో దేవస్థానం ఏర్పాటు చేసింది. పూజల అనంతరం యాత్రికులందరికీ స్వామివారి ఆలయంలో అన్న ప్రసాదం అందజేశారు.

సేవలకు సత్కారం...

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పలు విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలను అందించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్ల నుంచి వారు పురస్కారాలను స్వీకరించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు.





కాకినాడలో డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి నుంచి నుంచి అవార్డులు అందుకుంటున్న గ్రహీతలు వరుసగా కాకినాడ ఆర్‌డి మల్లిబాబు పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి, యు.కొత్తపల్లి తహశీల్దార్ జి.చిన్నారావు, జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, వైద్యులు ప్రణీత్, ఆర్ అండ్ బి ఎఇ సాయికిరణ్, ఏలేశ్వరం విఆర్‌ఒ ఎ.కిశోర్, కత్తిపూడి ఎంవిఐ బి.శ్రీనివాస్, హెచ్‌ఎం ఆర్.సత్యవేణి, సాస్ డైరెక్టర్ యాళ్ల పద్మలత, అడబాల రత్న ప్రసాద్,





డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, మంత్రి సుభాష్ నుంచి పురస్కారాలు అందుకుంటున్న అధికారులు వరుసగా... ఆలమూరు ఎంపిడిఒ రాజు, పి.గన్నవరం ఎడిఎ విజయ్‌కుమార్, డిటి సుబ్బరాజు, ఇఒ వీర్రాజు, మున్సిపల్ ఉద్యోగి బి.వీరన్నశానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సుబ్బరాజు, ఇన్‌స్ట్రక్టర్ నరసింహచంద్రకుమార్, వ్యవసాయ సహాయకురాలు స్పందన, కంప్యూటర్ ఆపరేటర్ సత్తిబాబు, ముమ్మిడివరం డిటి గోపాలకృష్ణ, కామనగరువు ఇఒరుద్రరాజు ఎస్ఎస్.సూరపురాజు, అక్కిరాజు చారిటబుల్ ట్రస్టు అధినేత లతేంద్రవర్మ,





తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కందుల దుర్గేష్ నుంచి అవార్డులు అందుకుంటున్న చాగల్లు తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఉండ్రాజవరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ వివిఎస్.రామారావు, ఇఒ జివివి.సత్యనారాయణ, గోకవరం ఎపిఒ అప్పలరాజు, చాగల్లు డిటి శ్రావణ్‌కుమార్, గోపాలపురం ఎఎస్ఒ జోడా వెంకటేశ్వరరావు, కడియం ఎంపిడిఒ రమేష్, దేవరపల్లి తహశీల్దార్, ఎం.శ్రీనివాస్, పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ఐ.పావని, బిక్కవోలు ఎంఎల్‌హెచ్‌పి మనీషా, నిడదవోలు జూనియర్ అసిస్టెంట్ సత్యప్రసాద్; సీనియర్ అసిస్టెంట్ కె.సాయిరామ్, ప్లానింగ్ సెక్రటరీ వెంకటసాయికుమార్

మరిడమ్మను దర్శించుకున్న తహశీల్దారు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మను శుక్రవారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆమెకు దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు, ఆసాదులు ఆమెకు వేదాశీర్వచనాలతో అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి క్రాంతి, వరహాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కూటమి ప్రభుత్వం పింఛను తొలగింపు వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క కొత్త పింఛను మంజూరు చేయకుండా, అర్హత కలిగి ఉండి ఎన్నో ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న పేదలపై కక్ష సాధింపు చర్యలలో భాగంగా సుమారు 20 ఏళ్లుగా పింఛను పొందుతున్న వారి పింఛన్లు సైతం తొలగించడం అన్యాయం అన్నారు. వీటిలో వితంతు పింఛనుదార్లు ఉండటం గమనార్హం అన్నారు. పింఛను తొలగింపుకు విద్యుత్ బిల్లులు కారణంగా చూపడమే కాకుండా,ఇతరాత్ర కారణాలతో అర్హులైన చాలామందికి తల్లికి వందనం ఇవ్వకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పి ప్రజలను మోసం చేస్తుంది అని ఆరోపించారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాడతామని ఆయన హెచ్చరించారు.



చెక్కులు అందుకున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు మండలంలోని అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని ఆదుర్రుకు చెందిన గోకవరపు సత్యనారాయణమూర్తి, సీతామహాలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాతలు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు . వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి, శ్రీ స్వామివారి చిత్రపటంను అందజేశారు.



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. మండల కేంద్రం ఆత్రేయపురం మహాత్మా గాంధీ ఎయిడెడ్ పాఠశాల మరియు కళాశాల లో పదవ తరగతి లో అత్యధిక సాధించిన ఎం.గోవర్ధన్‌కు రూ. 5 వేలు, ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన బిహెచ్.ప్రియాంకకు రూ.10 వేలను డాక్టర్ ప్రముఖ హాంకాలాజిస్ట్ పి నారాయణ మూర్తి వారి పేరెంట్స్ పేరున ప్రోత్సాహాన్ని అందించారు కళాశాల కరస్పాండెంట్ ఎస్.రాజు మాట్లాడుతూ డాక్టర్ నారాయణ మూర్తి విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థినులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి -కరప

కరప నక్కా సూర్య నారాయణ మూర్తి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం కూడా 1984-85 బ్యాచ్ తరుపున 10వ తరగతి స్కూల్ టాపర్స్ ముగ్గురు విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. శుక్రవారం హైస్కూల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం డి.రమ్యశ్రీ సత్యరత్నమణికి రూ.5000, ద్వితీయ స్థానం వచ్చిన ఎన్.తేజ దుర్గా భవానికి రూ.3000, తృతీయ స్థానం వచ్చిన కె.సంధ్యకు రూ.2000, విద్యార్థినులకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ద్వారా నగదు బహుమతి అందజేశారు. ఆకుల వెంకట శ్రీనివాస్, సలాది సుబ్బారావు, వత్సవాయి వెంకటపతిరాజు, డాక్టర్ శ్రీదేవి, నక్కా ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో బ్యాటరీ కారులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం జెఎస్ఎన్.రాజు కనస్ట్రక్షన్స్ అధినేత జంపన సూర్యనారాయణ రాజు రూ. 12 లక్షల విలువైన బ్యాటరీ కార్లను అందించారు. వీటిని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు, చిన్నారులకు ఈ బ్యాటరీ కార్లు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయం అభివద్ధిలో దాతల సహకారం మరువలేనిదన్నారు. బ్యాటరీ కార్లో దేవాలయం మాడవీధిలో చుట్టు ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, యువ నాయకులు బండారు సంజీవ్ నడిపారు.



బ్యాటరీ కారును నడుపుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

అనంతరం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఎంఎల్ఎకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కుసం పూడి రామకృష్ణంరాజు, ముదునూరి వెంకటరాజు, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యనందం, గణిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఫ్యాన్ల బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రు పిహెచ్‌సికి జడ్‌పిటిసి సభ్యుడు కసిరెడ్డి ఆంజనేయులు ఆధ్వర్యంలో స్టానిక వాసులు తాడి భాస్కర్ రావు సీత దంపతులు, దాకే నవీన్ ప్రశాంతి దంపతులు కలిసి రెండు వాల్ ఫ్యాన్లను శుక్రవారం వైద్యాధికారిణి డాక్టర్ కె.సత్యవతికి అందజేశారు. ఈ సందర్భంగా దాతల ఔదార్యాన్ని ఆమె అభినందించారు.



లూటుకుర్రు పిహెచ్‌సికి వాల్ ఫ్యాన్లు అందిస్తున్న దాతలు

16 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కూనవరం గ్రామంలో బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేసి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మద్యం షాపులను ప్రభుత్వం మూసివేయించింది. ఈ నేపథ్యంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్ఐకి సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి కూనవరంలో దాడి చేశారు. ఈ దాడిలో 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.